ప్రభుత్వ భూములు పేదలకు పంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర అధ్యక్షుడు కలకొండ కాంతయ్య

రాజేంద్రనగర్: ప్రభుత్వ భూములను నిరుపేదలకు పంపిణీ చేయాలని సీపీఐ రాష్ట్ర అధ్యక్షుడు కలకొండ కాంతయ్య అన్నారు. రాజేంద్రనగర్‌లోని సీపీఐ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు జె.అంజయ్య అధ్యక్షతన మంగళవారం జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. పేదలకు భూములు, ఇండ్లు ఇస్తామని మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలే వ్యవసాయ కార్మికులు, కూలీలుగా జీవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పేదల సమస్యలు పరిష్కారం కావాలంటే ముందుగా భూ పంపిణీ చేపట్టాలని దానికోసం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పెద్దఎత్తున భూ పోరాటాలకు సిద్ధం కావాల్సిన అవసరముందని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఎర్రజెండా ఎప్పుడూ పేదలకు అండగా ఉంటుందని.. దాని కోసం కార్యకర్తలు వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గ్రామాల్లో సమస్యలు తెలుసుకొని పరిష్కారానికి నిత్య పోరాటాలకు సిద్ధం కావాల్సిన అవసరమ ఉందని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ప్రధానంగా ఆరు గ్యారెంటీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. నవంబర్ 29, 30వ తేదీల్లో రాష్ట్ర సమితి సమావేశాలు శంషాబాద్‌లో నిర్వహించి మొదటిరోజు రాష్ట్ర స్థాయి సెమినార్ కూడా చేపడుతామని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యుడు, మాజీ జిల్లా కార్యదర్శి పుస్తకాల నర్సింగ్ రావు, రాష్ట్ర సమితి సభ్యుడు ఓరుగంటి యాదయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్ధుల జంగయ్య, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.ప్రభులింగం, రాజేంద్రనగర్ మండల సీపీఐ కార్యదర్శి ఎండీ రియాజ్, గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు టి.నరసింహా రెడ్డి, బీకేఎంయూ జిల్లా కార్య నిర్వాహక అధ్యక్షుడు శివాల లక్ష్మయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు గాలయ్య, జిల్లా సమితి సభ్యులు రాములు, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

బైక్ మెకానిక్‌ల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

శంషాబాద్: శంషాబాద్ ద్విచక్ర వాహనాల మెకానిక్ అసోసియేషన్ పదో వార్షికోత్సవ ఆత్మీయ సమ్మేళనాన్ని మంగళవారం నిర్వహించారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, శంషాబాద్ డీసీపీ రాజేశ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..అసోసియేషన్లు తమ వ్యాపార వృద్ధితో పాటు సొంత సమస్యల పరిష్కారానికి ఎంతో ఉపయోగపడతాయన్నారు. అనంతరం హెచ్ఎంఆర్ అధ్యక్షుడు అశోక్‌కుమార్, ఉపాధ్యక్షుడు జగన్ గౌడ్ ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా బొబ్బిలి ఉమామహేశ్వర్ ముదిరాజ్, అధ్యక్షుడిగా కాసుల వెంకటేశ్‌గౌడ్, ఉపాధ్యక్షుడిగా సయ్యద్ షఫీక్, ప్రధాన కార్యదర్శిగా మహేందర్, కార్యవర్గ సభ్యులుగా ఆర్. మహేందర్, ఎస్.కె ఇమ్రోజ్, చంటి, శివలింగం, సాయికిరణ్, రాఘవేందర్‌గౌడ్, నవీన్‌యాదవ్, అరుణ్‌కుమార్, మధుగౌడ్, బాల్‌రాజ్, కె.మోత్యలు నియమితులయ్యారు.

మున్సిపాలిటీ పనితీరుపై ఫిర్యాదు



సీడీఎంఏ కమిషనర్‌కు ఫిర్యాదు ఇస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మణికొండ: మున్సిపాలిటీలో సకాలంలో పనులు జరగడం లేదని, చేసిన పనుల్లో నాణ్యత ఉండడం లేదని మున్సిపాలిటీకి చెందిన బీఆర్ఎస్ నాయకులు మున్సిపల్ శాఖ రాష్ట్ర కార్యాలయంలో కమిషనర్, డైరెక్టర్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్(సీడీఎంఏ) వీపీ గౌతమ్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ బీఆర్ఎస్ అధ్యక్షుడు సీతారాం మున్సిపాలిటీ పరిధిలోని రోడ్ల దుస్థితి, వీధి దీపాల పరిస్థితిని కమిషనర్‌కు వివరించారు. నాణ్యత లేని వీధి దీపాలు అమర్చడం వల్ల రెండు, మూడు రోజులకే పాడై పోతున్నాయని వాటిపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. అందించిన వారిలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. ధన్‌రాజ్, నాయకులు ఉపేంద్రనాథ్‌రెడ్డి, ఎ.లక్ష్మణ్‌రావు, ఎస్, శ్రీకాంత్, షేక్ ఆరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

'ఉర్దూ' మధురమైన భాష



మ్యాగజైన్ అల్-కలామ్‌ను ఆవిష్కరిస్తున్న వీసీలు ప్రొ.బీజేరావు, ప్రొ.సయ్యద్ ఐనుల్ హసన్

- హెచ్‌సీయూ వీసీ ప్రొఫెసర్ బీజేరావు
- 'మనూ'లో బీబీఎస్ ఉర్దూ ప్రాజెక్ట్ ప్రారంభం

రాయదుర్గం: 'ఉర్దూ' మధురమైన భాష అని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు అభివర్ణించారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ), భారతీయ భాషా సమితి (బీబీఎస్) సంయుక్త ఆధ్వర్యంలో మనూలో బీబీఎస్ ఉర్దూ ప్రాజెక్టును వీసీ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్‌తో కలిసి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉర్దూ రచయితల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మనూ వీసీ, బీబీఎస్ నోడల్ అధికారి ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ మాట్లాడుతూ విద్యార్థులను ఆకర్షించడానికి ప్రత్యక్ష విధానాన్ని అవలంబించాలని రచయితలకు ఆయన సూచించారు. ఏఎంయూ భాషాశాస్త్ర విభాగం ప్రొఫెసర్ ఇంతియాజ్ మాట్లాడుతూ ఎన్ఈపీ మాతృభాషలో విద్యను అందించడంలో ప్రాధాన్యత ఇస్తుందన్నారు.

బీబీఎస్ ఉర్దూ కార్యాలయం ప్రారంభించిన హెచ్‌సీయూ వీసీ బీజేరావు

ఉర్దూ విశ్వవిద్యాలయం క్యాంపస్‌లోని డెక్కన్ స్టడీస్ సెంటర్ ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన బీబీఎస్ ఉర్దూ కార్యాలయాన్ని హెచ్‌సీయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు ప్రారంభించారు. అనంతరం యూనివర్సిటీ మ్యాగజైన్ 'అల్-కలామ్' ప్రత్యేక సంచికను కూడా విడుదల చేశారు. డీటీటీఎల్‌పీ కార్యకలాపాలు, విజయాలపై షార్ట్ వీడియోను ప్రదర్శించారు. కార్యక్రమానికి దేశం నలుమూలల నుంచి 60 మంది ఉర్దూ రచయితలు హాజరయ్యారు.

'స్టడీ ఇన్ ఇండియా' యూనివర్సిటీ ఫెయిర్



కోర్సుల వివరాలు తెలుసుకుంటున్న విద్యార్థులు

శేరిలింగంపల్లి: స్టడీ ఇన్ ఇండియా యూనివర్సిటీ ఫెయిర్‌ను నల్లగండ్లలోని ఎపిస్టెమో వికాస్ లీడర్‌షిప్ స్కూల్‌లో మంగళవారం నిర్వహించారు. స్కూల్ కెరీర్ డిజైన్ ల్యాబ్ చొరవలో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 60 టాప్ ప్రైవేట్ యూనివర్సిటీలు పాల్గొన్నాయి. ముఖ్యంగా అశోక విశ్వవిద్యాలయం, మహీంద్రా, వీఐటీ, ఎస్ఆర్ఎం , శివ్ నాడార్, జీడీ గోయెంకా, క్రియా, అహ్మదాబాద్, ఇక్ఫాయ్, బిట్స్, క్రైస్ట్ యూనివర్సిటీ వంటివి పాల్గొన్నాయి. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొని ఆయా యూనివర్సిటీల్లో అందించే కోర్సులు, అంతర్జాతీయ సహకారం, స్కాలర్‌షిప్‌లు, ఉన్నత విద్యాకోర్సుల వివరాలను తెలుసుకున్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ పద్మకొల్లి, వైస్ ప్రిన్సిపాల్ మర్రి వాణి లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో వివిధ యూనివర్సిటీల ప్రతినిధులు, పాఠశాల ఫ్యాకల్టీ, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



పార్కులో పెరిగిన పిచ్చిమొక్కలు

ప్రహరీ కూలె..

మురుగు చేరె..

ట్రీ పార్కు అభివృద్ధి పాలకులు,అధికారులకు పట్టదా..?

- కూలిన ప్రహరీ, వాకింగ్ ట్రాక్
- అసంపూర్తిగా పార్కు పనులు



హఫీజ్‌పేట్: హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని గెజిటెడ్ ఆఫీసర్స్ కాలనీలోని ట్రీ పార్కు అభివృద్ధికి ఆమడదూరంలో ఉంది. చిన్నపాటి వర్షాలకే పార్కులో వరద నీరు చేరి వాకింగ్ ట్రాక్ మునిగింది. గత ఏడాది జీహెచ్ఎంసీ అధికారులు పార్కు అభివృద్ధి పనులు ప్రారంభించారు. కానీ ఇప్పటి వరకు కేవలం కొంత మేర వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేశారు. పిల్లల కోసం ఆటవస్తువులు ఏర్పాటు చేయాల్సి ఉంది. కాంట్రాక్టర్, అధికారుల నిర్లక్ష్యంతో పార్కు అభివృద్ధి అంతంత మాత్రంగానే ఉంది. పార్కులో పూర్తిగా పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. కాలనీలో సేద తీరడానికి రెండు పార్కులు ఉన్నాయి. ఒక పార్కును కాలనీ సొంత నిధులతో అభివృద్ధి చేసుకున్నారు. మరో పార్కు యూనిసెంట్ స్కూల్ పక్కనే ఉంది. కానీ ఈ పార్కును ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. కొండాపూర్‌లోని మై హోం మంగళ నుంచి ప్రేమ్‌నగర్, మార్తాండనగర్ మురుగు నీరు కూడా ఈ పార్కు పక్కన నుంచి వెళ్తుంది. వరదకు తోడు మురుగు నీరు పార్కులోకి చేరి దుర్గంధంగా మారింది. అధికారులు పార్కును పట్టించుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అధికారులు పట్టించుకోవాలి

గెజిటెడ్ ఆఫీసర్స్ కాలనీలో లింక్ రోడ్డును ఆనుకొని ఉన్న ట్రీ పార్కును జీహెచ్ఎంసీ అధికారులు అభివృద్ధి చేయాలి. పార్కులో ఆహ్లాదకర వాతావరణం నెలకొనేలా చూడాలి. – శంకర్, కాలనీవాసి

పనులు ప్రారంభమయ్యేలా చూడాలి

చిన్నపాటి వర్షానికే ప్రహరీగోడ కూలిపోగా, వాకింగ్ ట్రాక్ పాడైంది. పార్కు అభివృద్ధిపై ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించి పనులు ప్రారంభమయ్యేలా చూడాలి. –మనోజ్, స్థానికుడు



గెజిటెడ్ ఆఫీసర్స్ కాలనీలో ట్రీ పార్కు



నూతన కవర్లు వేస్తున్న జీహెచ్ఎంసీ సిబ్బంది

మ్యాన్‌హోల్స్‌కు మరమ్మతు

సాక్షి కథనానికి స్పందన

సాక్షి ఎఫెక్ట్..

మైలార్‌దేవ్‌పల్లి: మార్కండేయనగర్, బాబుల్‌రెడ్డినగర్ అంతర్గత రోడ్లపై పగిలిపోయిన మ్యాన్‌హోల్స్‌తో కొన్ని నెలలుగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీంతో(ప్రమాదకరంగా మ్యాన్‌హోల్స్) అనే శీర్షికన మంగళవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి చర్యలు చేపట్టారు. జలమండలి, జీహెచ్ఎంసీ అధికారులు సిబ్బందితో డ్రైనేజీ క్లీన్ చేయించి ప్రమాదకరంగా పగిలిన మ్యాన్‌హోల్స్ కవర్లను తొలగించి కొత్తవి ఏర్పాటు చేయించారు. మరో పది రోజుల్లో మిగిలిన వాటికి కూడా ఏర్పాటు చేస్తామని జీహెచ్ఎంసీ సర్కిల్ అధికారులు తెలిపారు. అలాగే డ్రైనేజీలు పొంగకుండా ఎప్పటికప్పుడు క్లీన్ చేయిస్తున్నామని జలమండలి అధికారులు పేర్కొన్నారు.



డ్రైనేజీని క్లీన్ చేయిస్తున్న జలమండలి అధికారులు

విద్యార్థి సంఘం ఎన్నికల నిర్వహణకు వీసీ ఆమోదం!

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో 2024–25 విద్యా సంవత్సరానికి విద్యార్థి సంఘం ఎన్నికలను నిర్వహించాలని నిర్ణయించారు. ఈ మేరకు ఎన్నికల నిర్వహణకు హెచ్‌సీయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు ఆమోదం తెలిపినట్లు తెలిసింది. దీంతో విద్యార్థి సంఘం ఎన్నికల నిర్వహణకు రంగం సిద్ధమైంది.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

మజ్లిస్ నేతలకు సూచించిన ఎమ్మెల్యే

గోల్కొండ: మజ్లిస్ నాయకులు, ఏరియా కమిటీ సభ్యులు ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహినుద్దీన్ అన్నారు.మంగళవారం ఆయన టోలీచౌకిలోని తన కార్యాలయంలో గోల్కొండ, టోలిచౌకి, నానల్‌నగర్ డివిజన్లకు చెందిన మజ్లిస్ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సమస్యలు తెలుసుకొని ఎప్పటికప్పుడు తన దృష్టికి తేవాల్సిన బాధ్యత ఆయా ఏరియా కమిటీ ప్రతినిధులదేనని అన్నారు. ఒక వైపు సమస్యలు పరిష్కరిస్తునే, మరోవైపు సేవా కార్యక్రమాలను కూడా మజ్లిస్ పార్టీ చేస్తున్నదని చెప్పారు. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా తమ పార్టీ పూర్తిస్థాయిలో కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మొహమ్మద్ నసీరుద్దీన్, నాయకులు ఆరుఫ్ ఫరాన్, అజీజ్ ఖాన్ పఠాన్, అబిన్ అవ్వద్, యూనుస్ తదితరులు ఉన్నారు.

అనారోగ్యంతో అటెండర్ మృతి



మహేశ్ (ఫైల్)

మణికొండ: నార్సింగి మున్సిపల్ కార్యాలయంలో అటెండర్‌గా పనిచేస్తున్న కె. మహేశ్(38) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారని గ్రామస్తులు తెలిపారు. మున్సిపాలిటీ నుంచి అంత్యక్రియలకు రూ. 10 వేలు అందించినట్లు మేనేజర్ యోగేశ్ తెలిపారు.

ప్రజాసేవ చేసేవారికే గుర్తింపు

లంగర్‌హౌస్: ప్రజాసేవ చేసేవారిని సమాజం గుర్తించి గౌరవిస్తుందని తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్ చైర్మన్ ఏహెచ్ఆర్ఓ పీస్ అంబాసిడర్ మొహమ్మద్ నజీబ్ అన్నారు. మంగళవారం సీనియర్ మజ్లిస్ నాయకుడు, సంఘసేవకుడు ఖాలేద్ అలిఖాన్‌కు టోలిచౌకిలో ఉత్తమ సేవా అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాలేద్ అలిఖాన్ రాజకీయంగానే కాకుండా సామాజసేవకునిగా గుర్తింపు పొందారన్నారు. నిరుపేదలకు అండగా ఉంటూ వారికి సహాయసహకారాలు అందిస్తున్నారన్నారు. కోవిడ్ కష్టకాలంలో తాము చేపట్టిన సేవా కార్యక్రమాల్లో ఖాలేద్ ఎంతగానో సహకరించారన్నారు. సుమారు ఆరు నెలలపాటు కోవిడ్‌లో వరుస కూలీలకు ప్రతి నిత్యం రెండు పూటల భోజనం అందించగా ఈ గొప్ప కార్యంలో ఖాలీద్ చురుకుగా పాల్గొన్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మొహమ్మద్ మొహమూద్ అలీ, మొహమ్మద్ ఇస్మాయిల్, సమీర్, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

సీబీఐటీలో 21నుంచి బూట్‌క్యాంప్



పోస్టర్‌ను విడుదల చేసిన ప్రిన్సిపాల్, అధ్యాపకులు

మణికొండ: గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ) కళాశాలలో ఈనెల 21 నుంచి 25 వరకు రోబోటిక్ ప్రాసెస్ ఆటోమేషన్‌పై బూట్ క్యాంప్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ సీవీ నరసింహులు తెలిపారు. క్యాంప్ పోస్టర్‌ను అధ్యాపకులతో కలిసి మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఔరంగాబాద్ సహకారంతో 5 రోజుల పాటు కొనసాగుతుందన్నారు. రోబోటిక్ ప్రాసెస్ ఆటోమేషన్ అనేది డిజిటల్‌తో పరస్పర చర్య చేయడంలో మానవ చర్యలను అనుకరించేందుకు సాఫ్ట్‌వేర్ రోబోలు, బాట్‌లు ఉపయోగించి పునరావృతమయ్యే పనులను ఆటోమేషన్ చేసే సాంకేతికతపై చర్చిస్తామన్నారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్లు కే గంగాధర్‌రావు, పీ. రమేశ్‌బాబు, డాక్టర్ టీ. సత్యనారాయణ మూర్తి, డాక్టర్ బబీ. స్వాతిసౌమ్య, ఐటీ విభాగం అధిపతి ప్రొఫెసర్ ఎం. వేణుగోపాలాచారి పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న డీఈ రమేశ్‌చంద్ర

మణికొండ: నార్సింగిలోని డీఈ కార్యాలయంలో ఇబ్రహీంబాగ్ డివిజన్ విద్యుత్ శాఖ ఇంజినీర్‌గా రమేశ్ చంద్ర మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు పనిచేసిన డీఈ శివశంకర్ రాజేంద్రనగర్ విద్యుత్ సర్కిల్ డీఈ (టెక్నీకల్)గా బదిలీ కాగా ఆయన స్థానంలో రమేశ్ ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి విద్యుత్ సమస్యలు తమ దృష్టికి తీసుకు వస్తే సత్వర పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. అలాగే నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకుంటామని, వినియోగదారులు కూడా సకాలంలో బిల్లులు చెల్లించి సహకరించాలని కోరారు. అంతకుముందు డీఈకి ఏడీఈలు అంబేడ్కర్, రాజేశ్, సహాయ ఇంజినీర్లు నరేందర్, జానీ మొహినుద్దీన్, దుర్గాప్రసాద్, సంతోష్, విద్యుత్ ఉద్యోగుల సంఘం నాయకుడు ఎం. భాస్కర్‌రెడ్డి ఘనంగా స్వాగతం పలికారు.

19న జిల్లా ఆస్పత్రిలో డాక్టర్లకు ఇంటర్వ్యూలు

గచ్చిబౌలి: కొండాపూర్ జిల్లా ఆస్పత్రిలో కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేసేందుకు డాక్టర్లకు ఈ నెల 19న వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ ఆఫ్ హాస్పిటల్ సర్వీసెస్(డీసీహెచ్ఎస్)రంగారెడ్డి జిల్లా డాక్టర్ చంద్రశేఖర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2025 మార్చి 30 వరకు పని చేసేందుకు స్పెషలిస్టులను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. కొండాపూర్ జిల్లా ఆస్పత్రిలోని కాన్ఫరెన్స్ హాల్‌లో 19వ తేదీ ఉదయం 11 గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఒరిజనల్ సర్టిఫికెట్స్‌తో పాటు అటెస్టేషన్ చేసిన జిరాక్స్ కాపీలు వెంట తెచ్చుకోవాలని ఆయన సూచించారు. ఓబీజీ, జీఎం, జీఎస్, ఆర్థో, రేడియాలజీ, జీడీఎంఓ తదితర విభాగాల్లో పని చేసేందుకు 20 మంది డాక్టర్లు అవసరమని రంగారెడ్డి జిల్లాలోని టీవీవీపీ ఆస్పత్రుల్లో పని చేయాల్సి ఉంటుందన్నారు.

ఫిజియోథెరపీతో జన్యు సమస్యల పరిష్కారం



మాట్లాడుతున్న డా.తరిగొప్పుల రాజు

శంషాబాద్: జన్యుపర, ఇతర కారణాలతో కొందరు పిల్లల్లో వెన్నెముక గాయాలు, తక్కువ బరువుతో పుట్టడంతో అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని ఫిజియోథెరపీ, అక్యుపేషన్ థెరపీల ద్వారా సమస్యను పరిష్కరించుకునే మార్గముందని గ్లోబల్ చైల్డ్ డెవలప్‌మెంట్ సంస్థ నిర్వాహకుడు డాక్టర్ తరిగొప్పుల రాజు అన్నారు. మంగళవారం ఆయన స్థానికంగా మాట్లాడారు. తమ సంస్థ ద్వారా నిపుణులైన థెరపీస్టుల ఆధ్వర్యంలో దిల్‌సుఖ్‌నగర్, సంజీవ్‌రెడ్డినగర్‌లో అనేక రకాల సేవలను అందిస్తున్నట్లు ఆయన తెలిపారు.



ప్రభుత్వ స్కూల్ నిర్మాణం ఎప్పుడో?

- జియాగూడ 2 బీహెచ్‌కే వాసుల ఎదురుచూపు
- 2018లో భూమి పూజ.. ముందుకు కదలని పనులు
- ఏళ్లు గడుస్తున్నా పట్టించుకోని నాయకులు, అధికారులు

జియాగూడ: జియాగూడలోని 2 బీహెచ్‌కేలో ప్రభుత్వ ప్రైమరీ స్కూల్ బౌలి గులాబ్‌సింగ్ బిల్డింగ్ కోసం స్థలం కేటాయించినా నిర్మాణం అతీగతీలేదు. జియాగూడలోని ఈ పాఠశాల భవనం ఈబీహెచ్‌కే క్వార్టర్స్ మధ్యలో ఉండేది. కాగా, అప్పట్లో 2 బీహెచ్‌కే బిల్డింగ్ కోసం స్కూల్ స్థలాన్ని అధికారులు తీసుకున్నారు. అంబేడ్కర్ భవన్ ఆటస్థలం పక్కన స్కూల్ బిల్డింగ్ కోసం స్థలాన్ని కేటాయించారు. అప్పటి కార్పొరేటర్ సైతం 2018లో భూమి పూజ నిర్వహించారు. అయితే, స్కూల్ బిల్డింగ్ నిర్మాణం మాత్రం జరగలేదు. ఆ తరువాత దాని గురించి పట్టించుకునేనాథుడే లేడు. ఈ విషయమై పలుమార్లు అసోసియేషన్ వారు ఎమ్మార్వో, స్థానిక ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్‌ను కలిసినప్పటికీ ప్రయోజనంలేకపోయింది. దీంతో ఈ స్థలం నిరూపయోగంగానే ఉంది. మరోవైపు ఈ స్థలాన్ని కబ్జాచేసేందుకు ఆక్రమణదారులు కన్నేశారు. ఈ స్థలంలో ప్రభుత్వ ప్రైమరీ స్కూల్ బిల్డింగ్ నిర్మిస్తే 2 బీహెచ్‌కేలో నివాసం ఉంటున్న కుటుంబాల పిల్లలకు, పరిసరాల సంజయ్‌నగర్, డోర్‌బస్తీ, ఇమాంపురా తదితర ప్రాంతాల పిల్లలకు ఎంతో మేలు జరుగుతుంది. విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోవడంతోపాటు స్థలం ఉన్నచోట పర్మనెంట్ బిల్డింగ్ నిర్మిస్తే బావుంటుందని కాలనీవాసులు కోరుతున్నారు.



ప్రభుత్వ ప్రైమరీ స్కూల్ నిర్మాణానికి కేటాయించిన స్థలం

ఘనంగా అబ్దుల్ కలాం జయంతి



అబ్దుల్ కలాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న యూత్ సభ్యులు

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని శ్రీరామ్‌నగర్ బుద్వేల్ చౌరస్తాలో రాజేంద్రనగర్ సర్కిల్ నవయువయూత్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం అబ్దుల్ కలాం జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కలాం దేశానికి చేసిన సేవలు ఎంతో గొప్పవని కొనియాడారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు ఏర్వ కుమారస్వామి, ఉపాధ్యక్షుడు రమేశ్‌రెడ్డి, కొంపల్లి జగదీశ్ ,జి శ్రీనివాస్, చిరంజీవిగౌడ్, కిశోర్, అనిల్, రవి తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామం, పోషకాహారం, నిద్ర అవసరం

న్యూరో, స్పైన్ సర్జన్ డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి



మాదాపూర్: ఎక్కువ సేపు కూర్చోవడం, ధూమపానం , స్టెరాయిడ్స్ తీసుకోవడం వంటివి వెన్నెముకను ప్రభావితం చేస్తాయని న్యూరో, స్పైన్ సర్జన్ డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. ప్రపంచ వెన్నెముక దినోత్సవం సందర్భంగా మాదాపూర్‌లోని మెడికవర్ ఆసుపత్రిలో మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమం తప్పకుండా వ్యాయామం, సరైన ఆహారం, సమయానికి నిద్రపోవడం వల్ల వెన్నెముక ఆరోగ్యకరంగా ఉంటుందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా 100 కోట్ల మంది వెన్నునొప్పి, వెన్నెముక సమస్యలతో బాధపడుతునట్లు అంచనా అని తెలిపారు.